క్లుప్తంగా

ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు నమోదుచేయాలి


బోధనను పరిశీలిస్తున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కెరమెరి: ప్రతి ఎఫ్ఆర్ఎస్‌లో విద్యార్థుల హాజరు నమోదు చేయాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని కెలికే పాఠశాలను శనివారం ఆయన సందర్శించి రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు పాఠాలు సులభపద్ధతిలో బోధించాలన్నారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హెచ్ఎం సోము, ఉపాధ్యాయులు శ్రీధర్, రమ్యక్రిష్ణ ఉన్నారు.

పాఠశాలల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్

దహెగాం: మండల కేంద్రంతో పాటు, కొత్తపల్లి, ముత్యంపేట ప్రాథమిక పాఠశాలలను శనివారం తహసీల్దార్ మునవార్ షరీఫ్ తనిఖీ చేశారు. పాఠశాలల్లోని హాజరు శాతం, మధ్యాహ్న భోజనం, పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. పాఠశాలల ప రిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

పెంచికల్‌పేట్: మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన మడే చుక్కయ్య ఆవు శనివారం సోలార్ పంపు వద్ద విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. సోలార్ పంపు వద్ద మేత మేస్తున్న సమయంలో విద్యుత్ తీగ తెగి సోలార్ పంపు ఇనుప చువ్వలపైన పడింది. ఆవు ఇనుప చువ్వలకు తగలడంతో విద్యుత్‌షాక్‌తో అక్కడే మృతి చెందింది. ప్రభుత్వం స్పందించి పరిహారం ఇవ్వాలని రైతు కోరుతున్నాడు.

నాలా పూడిక తీత


పూడిక తీయిస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్ టౌన్: పట్టణంలోని సంజీవయ్య కాలనీ సమీపంలోని ప్రధాన మురుగు కాలువలో శనివా రం మున్సిపల్ అధికారులు పూడిక తీత పనులు చే పట్టారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరదనీరు కాలనీల్లోకి రాకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో కురిసిన వర్షాలతో సంజీవయ్య కాలనీ నీట మునగడంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు ప్రధాన మురుగు కాలులో పేరుకపోయిన చెత్తను తొలగించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

'ఆదివాసీలకు అన్యాయం చేస్తే ఊరుకోం'

కాగజ్‌నగర్ రూరల్: ఆదివాసీలకు అన్యాయం చేస్తే ఊరుకోమని జీవో 49 వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు చాంద్‌పాషా, సోయం చిన్నయ్య హెచ్చరించారు. శనివారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవో ఆదివాసీలకు అన్యాయం చేసేలా ఉందన్నారు. ప్రజలను తప్పుదోవ ప ట్టించేలా వ్యవహరిస్తే సహించబోమని, అలాంటి నాయకులను జిల్లాలో తిరగనివ్వమని హె చ్చరించారు. జీవో శాశ్వత రద్దు కోసం ఈనెల 28 చలో కలెక్టరేట్‌తో పాటు మహాధర్నాను ని ర్వహించనున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యా ప్తంగా అంగన్‌వాడీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా ల కు అటవీ శాఖ అధికారులు అనుమతులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూముల్లో సాగు చేస్తున్న రైతులపై అధికారులు దాడులు చేయడం సరికాదన్నారు. షె డ్యూ ల్ 5, పెసా చట్టం, 1/70, అటవీ హక్కు చ ట్టం 2 00 6లను పకడ్బందీగా అమలు చేయాలన్నారు.

రాజకీయ లబ్ధి కోసం ఆదివాసీలను బలి చేయొద్దు

నార్నూర్: రాజకీయ లబ్ధి కోసం ఆదివాసీలను బలి చేయొద్దని, ఖబడ్దార్ సోయం బాపూరావు అని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కుమురంభీం భవన్‌లో మాట్లాడారు. రాజకీయ భవిష్యత్‌ను ఇచ్చిన సంఘంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మానిక్‌రావు, అడ శ్రీరామ్, మాడవి ఆనందరావు, ఏత్మారామ్ పాల్గొన్నారు.

బడులు ఇలా.. చదువులు ఎలా

- వర్షానికి ఉరుస్తున్న భవనాలు
- తరగతి గదుల్లో చేరుతున్న నీరు
- శిథిలావస్థకు చేరిన కొన్ని భవనాలు
- ఒకే గదిలో పిల్లలకు విద్యాబోధన


శిథిలావస్థకు చేరిన దొడ్డిగూడ పాఠశాలలో పిల్లలు


ఖమాన పంచాయతీ గొల్లగూడ(కె) ఎంపీపీఎస్ పాఠశాలలోని తరగతి గది పరిస్థితి. ఇక్కడ 50 మందికి పైగా విద్యార్థులకు ఇద్దరు టీచర్లు ఉన్నారు. పాత భవనంపై రెండేళ్ల క్రితం బేరింగ్ కోట్ వేసినా కురుస్తున్న వర్షాలకు పైకప్పు ఊరుస్తోంది. మిగిలిన రెండు గదుల్లో పిల్లలను కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. మన ఊరు–మనబడిలో భాగంగా చేపట్టాల్సిన మరుగుదొడ్లు ఇప్పటికి పూర్తి కాలేదు. పాత మరుగుదొడ్లే వాడుతున్నారు.

వాంకిడి: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రభుత్వ పాఠశాలల భవనాలు తడిసి ముద్దవుతున్నాయి. తరగతి గదుల పైకప్పులు ఊరుస్తున్నాయి. గది అంతటా నీరు చేరడంతో విద్యా బోధన ఇబ్బందిగా మారుతోంది. ఇప్పటికే శిథిల భవనాలు, అరకొర వసతుల నడుమ విద్యా బోధన కొనసాగుతుంది. కురుస్తున్న వర్షానికి ఎప్పుడు పెచ్చులూడి పడతాయోనని ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో మొత్తం 100 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 5,249 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సర్కారు బడుల అభివృద్ధికి గత బీఆర్ఎస్ 'మన ఊరు-మనబడి'పథకాన్ని తీసుకువచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'తో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించింది. విద్యుత్, తాగు నీరు, గోడలకు పెయింటింగ్, నూతన తరగతి గదులు, బోర్లు, మరుగుదొడ్లు, ప్రహరీలు, వర్షాలకు ఉరుస్తున్న భవనాలపై బేరింగ్ కోట్, హ్యాండ్ వాష్ బేసిన్‌ల ఏర్పాటు తదితర మరమ్మతుకు పనులు ప్రారంభించింది. బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు మధ్యలో వదిలేశారు. పనులు చేపట్టిన కొన్ని చోట్ల నాణ్యత లేమితో ఒక్క ఏడాదిలోనే శిథిలమైపోతున్నాయి. అనేక పాఠశాలల భవనాలు వర్షాలకు ఊరుస్తుండటంతో పిల్లలకు కూర్చునేందుకు చోటు లేకుండా ఉంది. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి బోధించాల్సి పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులే కాకుండా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


దొడ్డిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పరిస్థితి. ఇక్కడ 50 మంది పిల్లలు చదువుతున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఒక వరండా, ఒక తరగతి గది మాత్రమే ఉండగా కురుస్తున్న వర్షానికి ఊరుస్తోంది. ప్రత్యామ్నాయంగా లేక ఇందులో తరగతులు కొనసాగిస్తున్నారు. స్లాబు పైకప్పు పిల్లలపై పడితే ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితి గత కొన్నేళ్లుగా ఉన్నా అధికారులు ప్రతిపాదనలు పంపించడంతోనే సరిపెట్టుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

అసంపూర్తి పనులు చేపట్టాలి


గొల్లగూడ(కె) పాఠశాలలో ఒక గది వర్షాలకు ఊరుస్తోంది. రెండు, మూడు తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెడుతున్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రారంభించిన పనులు అర్ధంతరంగా వదిలేశారు. మరుగుదొడ్లకు సంబంధించిన గోడలు నిర్మించారు. అసంపూర్తి పనులను వెంటనే చేపట్టాలి.

– జాడి తిరుపతి, విద్యార్థి తండ్రి, ఖమాన

పట్టించుకోవడం లేదు


ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాలు కురిస్తే ఊరుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పిల్లలను ఒకే గదిలో కూర్చోబెడుతున్నారు. స్లాబ్‌పై పెచ్చులు ఎప్పుడు పడిపడతాయోనని భయంగా ఉంటుంది. అధికారులు నూతన పాఠశాల భవన నిర్మాణం చేపట్టాలి.

– గుర్నులె దొడ్డాజీ, గ్రామపటేల్, దొడ్డిగూడ

వామ్మో..ఇవేం రోడ్లు


సాలేగూడ వెళ్లే దారి బురదమయం


గుండి రోడ్డుపై గుంతలు

- జిల్లాలో కురుస్తున్న వర్షాలకు బురదమయం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- బైక్‌లు, అంబులెన్స్‌లు వెళ్లలేని దుస్థితి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని గత ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో మట్టి రోడ్లు బురదమయం అవుతున్నాయి. అప్పపల్లి, సాలేగూడ, వావుదాం, సల్పాలగూడ, తేనుగూడ, హిరాపూర్, బలన్‌పూర్, పాడిబండతోపాటు ఏజెన్సీ గ్రామాల్లో మట్టి రోడ్లే ఉన్నాయి. వర్షాలకు బురదగా మారడంతో ప్రజలు అడుగు తీసి అడుగు వేయలేకపోతున్నారు. రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితిలో 108 వాహనం కూడా రాలేని దుస్థితి నెలకొంది.

జిల్లా కేంద్రంలో ఇదే పరిస్థితి..

జిల్లాకేంద్రంలోని గుండి రోడ్డు, ఆసిఫాబాద్ జన్కాపూర్ మధ్యలోని ప్రధాన రహదారి పాత ఆర్టీవో కార్యాలయం వద్ద గుంతలమయంగా మారింది. దీంతో వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు లేక వర్షపు నీరు నిలిచి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి. వివేకానంద చౌక్, జూబ్లీ కూరగాయాల మార్కెట్ వద్ద వర్షపు నీరు నీరు నిలిచి చెరువు తలపిస్తాయి. అటువైపు నడిచి వెళ్లే వారికి వాహనాలు వస్తే నీళ్లు చిల్లుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే పట్టించుకుని గుంతలు పూడ్చివేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'చలో కలెక్టరేట్' విజయవంతం చేయండి


మాట్లాడుతున్న తలండి మధుకర్

పెంచికల్‌పేట్: టైగర్ కన్సర్వేషన్ జీవో 49 శాశ్వత రద్దు కోసం ఈనెల 28న తలపెట్టిన ఆదివాసీల చలో కలెక్టరేట్ కార్యక్రమానికి విజయవంతం చేయాలని గోండ్వాన ఆదివాసీ కోయ సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి మధుకర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివాసీలను అడవుల నుంచి తరిమివేసే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఆదివాసీలతో పాటు అన్నివర్గాల ప్రజలు జీవోకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు జనార్దన్, శ్రీనివాస్, నర్సింగరావు, తిరుపతి, రవి, ప్రసాద్, రాజు, రమేశ్, దేవాజీ, వెంకటి పాల్గొన్నారు.

ఏఐటీయూసీ వైఫల్యంతోనే ప్రైవేటు నియామకం


మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాస్‌రావు

రెబ్బెన: గుర్తింపు సంఘం ఏఐటీయూసీ వైఫల్యంతోనే బెల్లంపల్లి ఏరియాలోని వర్క్‌షాప్ పరిధిలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు, హెల్పర్ల నియామకం జరుగుతోందని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు ఆరోపించారు. శనివారం ఏరియా వర్క్‌షాప్‌ను టీబీజీకేఎస్ నాయకులు సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ.. యాజమాన్యంతో పోరాటం చేయలేక ప్రైవేటు కార్మికులను ప్రవేశపెట్టారని మండిపడ్డారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ కలిసి ధర్నా నిర్వహించారని అది ముమ్మాటికి కార్మికులను మభ్యపెట్టడానికి అడిన డ్రామానే తప్పా కార్మికులపై ప్రేమతో కాదన్నారు. సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మంగీలాల్, ఏరియా కార్యదర్శి వెంకటేశ్, పిట్ కార్యదర్శి శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సురేష్, కమిటీ సభ్యులు వైకుంఠం, స్టోర్స్ పిట్ కార్యదర్శి గణపతి పాల్గొన్నారు.

పిడుగుల భయం..!


కౌటాలలో పిడుగుపాటుకు మృతి చెందిన రైతులు (ఫైల్)

- పిడుగు పాటుకు ఏటా పలువురి మృత్యువాత
- జిల్లాలో కురుస్తున్న వర్షాలు
- అవగాహన ఉండాలంటున్న నిపుణులు

కౌటాల: ఉరుములు.. మెరుపులు వచ్చాయంటే జనం హడలెత్తిపోతున్నారు. ఏ సమయంలో ఎక్కడ ఎప్పుడు ఏమి జరుగుతుందో ఆందోళన చెందుతున్నారు. అసలే ఆకాశం మేఘావతమై ఉండటం.. ఒకపక్క వర్షం కురుస్తూనే.. మరోపక్క శబ్దాల భయం వెంటాడుతోంది. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేకంగా పిడుగుల సమాచారం తెలుసుకుంటున్నా కూడా.. పిడుగు పడే సమయంలో వచ్చే శబ్దం సైతం బెంబేలెత్తిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటకు వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు.

ఆగస్టు, సెప్టెంబర్‌లోనే అధికం..

ప్రధానంగా పిడుగు పాటు ప్రమాదాలు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నమోదవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో పిడుగుల తీవ్రత ఎక్కువ. పిడుగుల సమాచారం తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. వజ్రపాత్ లాంటి యాప్‌ల ద్వారా వర్షపాతం, పిడుగులు పడే పరిస్థితులను ముందుగానే తెలుసుకునే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉంటే పిడుగుల ప్రభావం నుంచి తప్పించుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

రక్షణ చర్యలు..

- వర్షం పడే సమయంలో ఇళ్లలోనే ఉండాలి. కిటికీలు, తలుపులు మూసి వేయాలి
- వర్షం పడే సమయంలో సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి
- పిడుగు పాటుకు గురైన వారు ప్రాణాపాయం నుంచి బయట పడడం అరుదు. అస్వస్థతకు గురైన వారిని వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి.
- బాధితుడికి వెంటనే ప్రథమ చికిత్స అందించాలి. పిడుగు తాకిన ప్రదేశం తడిగా ఉంటే బాధితుడిని దుప్పటిపై పడుకోబెట్టాలి. పిడుగుల ప్రభావంపై గ్రామాల్లో అధికారులు గ్రామీణ ప్రజలు, రైతులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి


ప్రస్తుతం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రజలు తప్పనిసరిగా పలు జాగ్రత్తలు పాటించాలి. రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ పిడుగుల బారి నుంచి ప్రజలను కాపాడటానికి ముందస్తు చర్యలో భాగంగా సెల్ ఫోన్లకు సందేశాలు పంపుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్న సమయంలో ప్రజలు బయట తిరగకూడదు.

– ప్రమోద్, తహసీల్దార్, కౌటాల

సీజనల్ వ్యాధులపై కళాజాత


పాటలు పాడుతున్న కళాజాత బృందం సభ్యులు

వాంకిడి: మండలంలోని పాఠగూడ గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై శనివారం కళాజాత నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై ఆటపాటలతో అవగాహన కల్పించారు. వర్షాకాలంలో అనారోగ్యం బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాజాత బృందం సభ్యులు గొడిసెల బాపు, పవార్ మోహన్‌నాయక్, మరప పురుషోత్తం, సోమశేఖర్, గుండ శిరీష, బొమ్మగోని వెన్నెల, పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించేందుకు చర్యలు


సమావేశమైన డీఐఈవో రాథోడ్ గణేశ్

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని డీఐఈవో రాథోడ్ గణేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. కళాశాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాభోదనలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవులు, అధ్యాపకులు కాంబ్లే బాలాజీ, నరేశ్ పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్‌కు నోటీసులు


ఫంక్షన్ హాల్ గేటుకు అంటించిన నోటీసు

వాంకిడి: వాంకిడి పంచాయతీ పరిధిలోని ప్రహ్లాద్ ముండే ఫంక్షన్ హాల్ యజమానికి జీపీ అధికారులు నోటీసులు జారీ చేశారు. శనివారం ఫంక్షన్ హాల్ గేటుకు నోటీసు అంటించారు. రెండు రోజుల్లో ఫంక్షన్ హాల్ తొలగించాలని లేకపోతే పంచాయతీ అధికారులు తొలగింపజేయనున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరగా ఫంక్షన్ హాల్ నిర్మాణం ప్రారంభించిన నాటి నుంచి అనుమతులు తీసుకోవాలని పలుమార్లు సూచించినట్లు తెలిపారు. పంచాయతీ ఆదేశాలను పట్టించుకోకపోవడంతోనే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఫంక్షన్ హాల్ యజమాని పోస్టులో నోటీసు పంపించడంతోపాటు హాల్ గేటుకు నోటీసు అంటించినట్లు 'సాక్షి'తో పేర్కొన్నారు.

చదువుతోనే మేధాశక్తి పెంపొందుతుంది



మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్

తిర్యాణి: చదువు ద్వారానే మేధాశక్తి పెంపొందుతుందని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మానవ అక్రమ రవాణాపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం కృషి చేయాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రేమ పేరిట యువతులకు మాయమాటలు చెప్పి పొరుగు రాష్ట్రాల్లో విక్రయిస్తున్నారని తెలిపారు. అనంతరం మానవ అక్రమ రవాణా అంశంపై పోలీసు కళాజాత బృందం సభ్యులు నిర్వహించిన నాటిక అందరినీ అకట్టుకుంది. సమావేశంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీఈవో అంటోనిరెడ్డి, ఎంపీడీవో వేముల మల్లేశ్, జిల్లా సర్‌మెడి మోతిరాం, డీఆర్‌డీవో డీపీఎం యాదగిరి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

ఇంద్రవెల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాథోడ్ రితేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు కేంద్రే బాలాజీ ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. కష్టపడి పని చేసి ఎన్నికల్లో గెలుపొందాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఖానాపూర్ అసెంబ్లీ కోకన్వీనర్ ఆరెల్లి రాజలింగు, నాయకులు రాథోడ్ భీంరావ్, కనక హనుమంత్‌రావ్, కోవ రాజేశ్వర్, దీపక్‌సింగ్ షెకవత్, మారుతి పాల్గొన్నారు.

చిత్తడిగా రోడ్డు


వాంకిడి: మండలంలోని ఇందాని గ్రామంలో ఓ వాడలో మట్టి రోడ్డు వర్షానికి చిత్తడిగా మారింది. ఆ దారిలో నడవాలంటేనే ఇబ్బందిగా మారింది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిజాయతీ చాటిన యువకులకు సన్మానం


సన్మానిస్తున్న సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: రోడ్డుపై దొరికిన పర్సును నిజాయతీగా పోలీస్‌స్టేషన్ వెళ్లి అప్పగించిన యువకులను పోలీసులు సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన గుగులోత్ అరుణ్, లావుడ్య హర్షవర్ధన్‌కు శనివారం రెబ్బెనలో పర్సు దొరికింది. నేరుగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. పర్సులో రూ.5400 నగదు ఉండటంతో అందులో వివరాల ఆధారంగా సిర్పూర్(టి)కి చెందిన రింకురాంగ్‌గా గుర్తించి అందజేశారు. నిజాయతీ చాటుకున్న యువకులను సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్ శాలువాతో సత్కరించి అభినందించారు.